

నూరేళ్ళ తెలుగు కథకు
నవ్య నీరాజనం - 56
నూరేళ్ళ తెలుగు కథకు



# కథలు రాయడం కష్టం! అయినా నాకవే ఇష్టం!

**- కాకాని చక్రపాణి**

ఆంగ్ల ఉపన్యాసకుడిగా 30 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉందాయనకు. చాలా పుస్తకాలను తెలుగు నుంచి ఆంగ్లంలోకి, ఆంగ్లం నుంచి తెలుగులోకి అనువదించారు. సోమర్‌సెట్ మామ్ సాహిత్యాన్ని ఔపోసన పట్టిన ఆయన ఇప్పటివరకూ మూడు కథా సంపుటాలు వెలువరించారు. పది నవలలు రాశారు. కథా రచనలో తనకంటూ ప్రత్యేక ముద్ర కలిగిన కాకాని చక్రపాణిగారితో ఇంటర్వ్యూ ఈవారం..



భార్య సువర్చలతో...

## నాకు మూడేళ్ల వయసులో నాన్న పోయారు

1942 ఏప్రిల్ 26న గుంటూరు జిల్లా చినకాకానిలో పుట్టాను. సుబ్బమ్మ, శ్రీరాములు మా తల్లిదండ్రులు. మేం మొత్తం ఆరుగురం సంతానం. మా నాన్నగారు కరణంగా పనిచేసేవారు. నాకు మూడేళ్ల వయసులోనే నాన్న చనిపోయారు. అప్పటికి మా పెద్దన్నకు 17 సంవత్సరాలు. ఇంకా చదువుకుంటున్నాడు. నాన్న చనిపోవడంతో మా కుటుంబం కాస్త ఇబ్బందుల్లో పడింది.

## నైట్ డ్యూటీస్ ఎక్కువగా ఉండేవి

మంగళగిరి, గుంటూరు, హైదరాబాదుల్లో నా చదువు సాగింది. ఇంగ్లీషు లిటరేచర్‌లోనూ, 'ప్రాచీన భారతదేశ చరిత్ర-సంస్కృతి-పురాతత్వ శాస్త్రం'లోనూ ఎం.ఏ. చదివాను. 'తెలుగు సాహిత్యంపై మామ్ ప్రభావం' అంశంపై పిహెచ్‌డి పట్టా పొందాను. అయితే ఈ చదువంతా వరుసగా జరగలేదు. నేను బి.ఎస్‌సి. మొదటి సంవత్సరం చదువుతుండగా 'ప్లూరసీ' వచ్చింది. దాంతో ఒక ఏడాది చదువు ఆగిపోయింది. తర్వాత ఆర్.ఎం.ఎస్‌లో ఉద్యోగం వచ్చింది. అందులో 11 ఏళ్ళు పని చేశాను. నేను చదివిందేమో బి.ఎస్‌సి. ఇక్కడ నా చదువుకు, నేను చేస్తున్న ఉద్యోగానికీ సంబంధం ఉండేది కాదు.దీంతో ఉద్యోగం చేస్తున్న రోజుల్లోనే బి.ఏ. చదివాను. నాకు నైట్ డ్యూటీస్ ఎక్కువగా ఉండేవి. గుంతకల్ ట్రైన్‌కు వెళ్లేవాడిని. సికింద్రాబాద్‌లో రాత్రి 9-10 గంటల మధ్య ట్రైన్ బయలుదేరితే పొద్దున్నే 7-20కి గుంతకల్ చేరేది. తిరిగి రాత్రికి సికింద్రాబాద్ చేరుకునేది. ఒక్కసారి డ్యూటీకి పోయి వచ్చామంటే నాలుగు రోజులు రెస్టు ఉంటుంది. అప్పుడు ఎం.ఏ. చదివాను.

## ఆంగ్లోపన్యాసకునిగా ఉద్యోగం

పదకొండేళ్లు పని చేశాక రైల్వే పోస్టల్‌లో ఉద్యోగం వదిలేశాను. మొదట నిజామాబాద్‌లో లెక్చరర్‌గా చేరాను. తర్వాత హైదరాబాద్‌లోని ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాలలో 1974లో ఆంగ్లోపన్యాసకునిగా ఉద్యోగంలో చేరాను. 26 ఏళ్లు అక్కడే ఉద్యోగం చేసి ఏప్రిల్ 2000లో పదవీ విరమణ చేశాను. 1966లో సావిత్రికి, నాకు పెళ్లయింది. మాకు ఇద్దరు అబ్బాయిలు. ఇద్దరూ సెటిల్ అయ్యారు. 1993లో నా భార్య చనిపోయింది. తర్వాత సువర్చలను పెళ్లి చేసుకున్నాను.

## ఇద్దరం తిరణాలకు వెళ్లే వాళ్లం

మాకు దగ్గరి బంధువు పి.ఎస్.నారాయణ. తనకు చిన్నప్పుడే అమ్మానాన్నా పోయారు. కాకానిలో మా ఇంటికి తను తరచూ వచ్చేవాడు. 'ప్లూరసీ' వచ్చి ఇంటి దగ్గర ఉన్న రోజుల్లో నాకు అకౌంటెన్సీ చెప్పేవాడు. వాళ్ళింట్లో తనే పెద్దవాడు. అందువలన తన వద్ద డబ్బు ఉండేది. నన్ను మంగళగిరిలో జరిగే తిరణాలకు తీసుకెళ్లేవాడు. అప్పటికే నారాయణ కథలు రాస్తున్నాడు. తన కథలకు అప్పట్లో మొదటి పాఠకుణ్ణి నేనే! తన సహచర్యంతో నేను కూడా కథలు రాయడం మొదలు పెట్టాను. ఏంటో చెప్పాలి, ఏదో రాయాలి అనే తహతహ ఉండేది. తొలి రోజుల్లో కథ రాయడం చాలా కష్టంగా అనిపించేది. 1960లో 'వినీల' అనే కలం పేరుతో కథ రాశాను. అది 'ప్రజామత'లో వచ్చింది. మొదట పబ్లిష్ అయిన కథ 'మహాపర్వతం మరుగుజ్జు'. కథ అచ్చయిన ఉత్సాహంతో వరుసగా మరో ఐదారు కథలు రాశాను.

## ఇప్పటికీ ఉద్యోగం పోయినట్టు కల వస్తుంటుంది

ఇబ్బందులు లేకుంటేనే కథలు రాయగలం. నేను ఐదారు కథలు రాశాక నా జీవితంలో అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆర్.ఎం.ఎస్‌కు రిజైన్ చేశాను. ఏడాది పాటు ఖాళీగా ఉన్నాను. మా ఆవిడ టీచర్‌గా పనిచేసేది. తనకొచ్చే 70రూపాయల జీతంతోనే మా కుటుంబం ఏడాదిపాటు నడిచింది. తర్వాత నాకు ఉద్యోగం వచ్చినప్పటికీ ఉద్యోగం లేని ఆ ఏడాదిలో అనుభవించిన బాధలు నిత్యం వెంటాడేవి. రిటైర్ అయిపోయాను కదా, ఇప్పటికీ నాకు ఉద్యోగం పోయినట్టుగా కల వస్తుంటుంది. మానసికంగా ఆ ఏడాది చాలా దెబ్బతిన్నాను. తర్వాత లెక్చరర్‌గా చేరినా ఉద్యోగ భద్రత ఉండేది కాదు. దీంతో పదిహేనేళ్లు కథలు రాయలేదు. రచయితలకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉండాలి. అప్పుడే మంచి కథలు, ఎక్కువ కథలు రాయగలరు.

## నేను పిహెచ్‌డి చేయలేననుకున్నారట!

ఎం.ఎ. ఇంగ్లీషు క్వాలిఫికేషన్‌తో ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాలలో లెక్చరర్‌గా చేరాను. మా కాలేజీలో ఒక సంప్రదాయముండేది. అక్కడ ఉద్యోగంలో చేరిన వారందరూ ఎంఫిల్, పిహెచ్‌డిలు చేసేవారు. మా ప్రిన్సిపాల్ కె.కె. రంగనాథాచార్యులు గారు అందరినీ బాగా ప్రోత్సహించేవారు. నాకు కొంత ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సు ఉండేది. దీంతో నేను పెద్దవాళ్లతో ఎవ్వరితోనూ మాట్లాడేవాడిని కాదు. నా సహోద్యోగి చంద్రశేఖరరెడ్డి నన్ను పిహెచ్‌డి చేయమని చెప్పారు. తెలుగు అధ్యయన శాఖ డైరెక్టర్ గంగిశెట్టి లక్ష్మీనారాయణగారి వద్దకు నన్ను తీసుకెళ్లారు. మాట్లాడకుండా మౌనంగా ఉన్న నన్ను చూసి 'ఇతను పిహెచ్‌డి చేయలేడు' అనుకున్నారట లక్ష్మీనారాయణగారు. ఆ ఉద్దేశ్యంతోనే నాకు మూడు టాపి



జి.చక్రధర్, చంద్రశేఖర్‌రెడ్డి, కె.కె.రంగనాథాచార్యులు, పోరంకి దక్షిణమూర్తి, గంగిశెట్టి లక్ష్మీనారాయణలతో...

క్‌లు ఇచ్చి పిహెచ్‌డి చేయమన్నారు. మిత్రులు సాయం చేశారు. టైం లోపలే పిహెచ్‌డి పూర్తి చేశాను.

### కథ రాయటం కష్టం

చాలా కాలం తర్వాత మళ్లీ కథలు రాయటం మొదలు పెట్టాను. 'మరమరాలు, బఠానీలు అందులో సామ్యవాదం' అనే కథకు ఓ కథల పోటీలో సెకండ్ ప్రైజ్ వచ్చింది. ఇక అప్పటి నుంచి వరుసగా అప్పుడప్పుడూ కథలు రాస్తూనే ఉన్నాను. ఇప్పుడు కథలు రాయటం చాలా తేలిక అనిపిస్తోంది. అయితే కథ కన్నా నవల రాయటం తేలిక. నవలే మనల్ని నడిపిస్తుంది. కథ అలాకాదు, కథను మనం నడిపించాలి. అందువలన కథ రాయటం కష్టం. గోర్కీ, మొపాసా, ఓ హెన్రీ కథలను కొన్నింటిని తెలుగులోకి అనువాదం చేశాను. ఆ కథలన్నీ అప్పట్లో 'ఆంధ్రప్రభ' వీక్లీలో 'విశ్వకథంబం' పేరుతో వచ్చాయి. నాకు సోమర్‌సెట్ మామ్ రచనలంటే చాలా ఇష్టం.

## నచ్చినవి

| | | |
|---|---|---|
| కథ | : | గులాబీ అత్తరు |
| నవల | : | చివరకు మిగిలేది |
| కవి | : | శ్రీశ్రీ |
| నటుడు | : | శోభన్‌బాబు |
| నటి | : | సావిత్రి |
| పాట | : | మౌనంగానే ఎదగమనీ.. |
| గాయని | : | జానకి |
| గాయకుడు | : | ఘంటసాల |
| వ్యక్తి | : | చంద్రశేఖర్‌రెడ్డి |
| స్వీటు | : | లడ్డు |

### ఎప్పుడూ పరీక్ష తప్పేవాడిని కాదు

నేను స్కూల్లో నార్మల్ స్టూడెంట్‌నే! నాన్న చనిపోయాడు కదా. వేరే చోట ఉండి చదువుకునే వాడిని. పరీక్ష తప్పితే ఇక నా చదువుకు ఫుల్‌స్టాపే! అందుకని ఎప్పుడూ పరీక్ష తప్పేవాడిని కాదు. పెద్ద తెలితేటలేవీ లేవు. కథలు రాయటం, అనువదించటం, చదువుకోవటం, మిత్రులతో మాట్లాడటం నాకు తృప్తినిచ్చే పనులు. అందుకోలేని ఆశలు లేవుగాని, జీవితానికి ఎంతో కొంత సార్థక్యం పొందాలనే కోరిక మొదటినుండీ ఉంది.

### ప్రతి వ్యక్తీ తనకొరకే అన్నది నిజం

నాకు మామ్ కథలంటే చాలా ఇష్టం. మామ్ 'మనిషి తను సుఖంగా బతకాలంటే ప్రథమంగా అవసరమైంది మానవుల అనివార్య స్వార్థ పరత్వాన్ని గుర్తించటం. ఇతరులు నీ కోర్కె తీర్చటం కోసం తమ కోర్కెలు త్యాగం చెయ్యాలనడం మహా అసంగతమైన పని. నువ్వు ఇతరులను స్వార్థ రహితంగా వుండమని అడుగుతున్నావు. వాళ్లలా ఎందుకుండాలి? ప్రతి వ్యక్తీ తన కొరకే అనే నిజంతో నువ్వు రాజీ పడినప్పుడు, నీ చుట్టూ వున్న వాళ్ల నుంచి నువ్వడిగేది అతి స్వల్పం. వాళ్లు నిన్ను నిరాశ పర్చరు. నువ్వు వాళ్లను మరింత సద్భావంతో పరికిస్తావు' అంటాడు. నేను కూడా దీనిని నమ్ముతాను.

### బుద్ధి పనిచేస్తున్నంత కాలం స్నేహం ఉంటుంది


డాక్టర్ చంద్రశేఖరరెడ్డిని నేను కలుసుకున్న రోజు 1974 జులై 8. ఆ రోజే మేమిద్దరమూ హైదరాబాదులోని 'ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల'లో ఉపన్యాసకులుగా చేరాం. మా స్నేహం సాయంకాలం నీడలా పోను పోను దీర్ఘమైంది. మాది బాల్య స్నేహం కాదు. ప్రేమ, ద్వేషం, ఇష్టం, అయిష్టం, కోపం, భయం– లాంటివన్నీ ఆవేశోద్వేగ జనితాలు. గుండెకు బుద్ధి ఉండదు. అందుకే స్నేహం సాధ్యమవుతుంది. దానికి కారణాలు వెతకటం అర్థం లేని పని. మేమిద్దరం కోపగించుకున్న క్షణాలూ ఉన్నాయి, వాదించుకున్న క్షణాలూ ఉన్నాయి. అతనెప్పుడూ ఎంత ఆవేశంలోనూ మాట మీరని మనిషి. నేను అతనికి పూర్తిగా విరుద్ధం. మనసులో మాట చెప్పటానికి వెనుకాడని మనిషిని. ఆవేశం ఒక స్థాయి వరకే. ఆ తర్వాత బుద్ధి పని చేస్తూ ఉంటుంది. అప్పుడే స్నేహం మిగులుతుంది. అలా మా స్నేహం ఇప్పటికీ కొనసాగుతోంది.

### అందనివాటిపైనే ఆశ ఎక్కువ

నాకు లడ్డూ అంటే ఇష్టం. లడ్డూ అనేకాదు, ఏ స్వీట్ అన్నా ఇష్టమే! అయితే నాకు 28 ఏళ్లనుంచి షుగర్ ఉంది. అందువలన నేను స్వీట్స్ తినకూడదు. ఇంకో తమాషా ఏమిటంటే నాకు చిన్నప్పటినుంచీ స్వీట్లంటే ఇష్టం ఉండేది కాదు. ఎప్పుడయితే డాక్టర్లు స్వీట్లు తినద్దని చెప్పారో, అప్పటినుంచీ వాటిపైన ఇష్టం పెరిగిపోయింది. కానీ తినకూడదు కదా! అదే బాధ.

### గ్రాంథికంలో ఉన్నా బాగా అర్థమయ్యేవి

నా బాల్యమంతా పల్లెటూర్లోనే గడిచింది. ఇప్పట్లా అప్పట్లో హడావుడి ఉండేది కాదు. చాలా లీజర్‌గా ఉండేవారు. మా పెద్ద వదినగారు కాశీమజిలీ కథలు, కథా సరిత్సాగరం చదివి వినిపించేవారు. వాటిని వినడం నాకూ చాలా ఆసక్తిగా ఉండేది. అప్పటికి నాది చిన్నవయసు. నిజానికి 'కాశీమజిలీ కథలు' గ్రాంథికంలో ఉంటాయి. అయినా అవి నాకు చాలా తేలికగా అర్థమయ్యేవి. ఎస్.ఎస్.ఎల్.సి. వరకే నేను తెలుగు చదువుకున్నాను. తర్వాత హిందీ, ఇంగ్లీషులో నా చదువు సాగింది. అయినా కూడా ఇప్పటికీ నేను మంచి తెలుగు రాస్తానని, నా రచనల్లో కొంత అలంకారిక పరిభాష ఉంటుందని నా మిత్రులు అంటుంటారు.


స్నేహితుడు పి.ఎస్.నారాయణతో...

ఇతర రచయితలకన్నా భిన్నంగా నా భాష ఉండటం నేను కూడా ఇష్టపడతాను.

### ఫోర్ క్లాసిక్స్ ఆఫ్ తెలుగు ఫిక్షన్

నేను వర్తమాన కథలు చదవటం లేదు. అప్పుడొకటి అప్పుడొకటి తెలిసిన వాళ్లవి మాత్రమే చదువుతున్నాను. తెలుగునుంచి ఇంగ్లీషులోకి అనువాదాలు చేస్తున్నాను. చరిత్రకు సంబంధించిన పుస్తకాలు ఎక్కువగా అనువాదాలు చేశాను. అనువాదాలకు ఆదరణ తక్కువ. ఇంగ్లీషునుంచి తెలుగులోకి అనువాదాలు చేస్తే వేసే పత్రికలున్నాయి. అదే ఇంగ్లీషులోకి అనువాదం చేస్తే ఎవరు వేస్తారు? మన శ్రమ వృథా. అందుకని నేను తెలుగునుంచి ఇంగ్లీషులోకి చాలా తక్కువ కథలను అనువాదం చేశాను. 'రాజశేఖర చరితము(కందుకూరి వీరేశలింగం), మైదానం (చలం), అల్పజీవి (రావిశాస్త్రి), చివరకు మిగిలేది (బుచ్చిబాబు)' నవలలు ఇంగ్లీషులోకి అనువాదం చేశాను. ఇవి నాలుగు పుస్తకాలూ కలిపి 'ఫోర్ క్లాసిక్స్ ఆఫ్ తెలుగు ఫిక్షన్' పేరిట ద్రవిడ యూనివర్సిటీ వారు పుస్తకంగా వెలువరించారు.

**–సుంకోజి దేవేంద్రాచారి**

నాకు నచ్చిన నా కథ

# స్వార్థం

**- కాకాని చక్రపాణి**

**''రండి, రండి, బహుకాల దర్శనం'' అని ఆహ్వానించాడా తాపసి వాళ్ళని.**

**ఆమె ముందుకు వచ్చి ఆయనకు పాదాభివందనం చేసింది.**

**''దీర్ఘ సుమంగళీభవ''**

**''ఈయన ద్వైపాయనులు, ఈయనా, అణిమాండవ్యుడూ సన్యాసం స్వీకరించారు. మేం ముగ్గురం కలిసి చదువు కున్నాం ఒకే గురుకులంలో. ఇప్పుడు వీళ్ళిద్దరూ కలసి ఉంటున్నారు. అణిమాండవ్యుడెక్కడికి వెళ్ళాడు మిత్రమా!'' అన్నాడామె భర్త, తాము తెచ్చిన కానుకల నాయనముందు ఉంచుతూ...**

**''బయటికెళ్ళాడు మాండవ్యా. కూర్చోండి''.**

**మాండవ్యుడి కొడుకు తల్లీదండ్రులను విడిచి పర్ణశాల బయట బంతితో ఆడుకోసాగాడు.**

**''ఒక్కడే పిల్లవాడా నీకు మాండవ్యా'' అని ద్వైపాయనుడు అడుగుతూనే ఉన్నాడు, అంతలో పాముున్న బిలంలో బంతి పడటం, దానికోసం పిల్లవాడు బిలంలో చెయ్యిపెట్టటం, పాముకాటు వేయటం ''అయ్యో! అమ్మో! పాము కరచింది'' అంటూ పిల్లవాడు స్పృహతప్పి పడిపోవటం జరిగింది.**

తల్లిదండ్రులిద్దరూ గుండెలు బాదుకుంటూ పిల్లవాడున్న చోటికెళ్ళారు. పిల్ల వాడి నోటినుంచి నురగలు వస్తున్నాయి.

మాండవ్యుడు కొడుకుని ఎత్తుకొని ద్వైపాయనుడి పాదాల మీద పడవేస్తూ ''భంతే! ప్రవ్రజితులకు ఔషధాల ప్రభావం తెలుస్తుంది. మా యజ్ఞదత్తుని రక్షించు'' అన్నాడు.

''నాకు ఔషధాల సంగతి తెలీదు. నేను వైద్యం చేయలేను'' అన్నాడాయన.

''పోనీ, మాపట్ల స్నేహభావంతో సత్యక్రియ చేసి అయినా పిల్లవాడిని రక్షించు''.

''మంచిది. అలాగే చేస్తాను'' అంటూ యజ్ఞదత్తుని తలపై చేయి ఉంచి, ''పుణ్య కాంక్షతో పూర్వం సప్తాహకాలం సంతోషంగా బ్రహ్మచర్యవ్రతం ఆచరించాను. ఈ యాభై సంవత్సరాలుగా పట్టు బలవంతాన, ఇష్టం లేక పోయినా బ్రహ్మచర్యవ్రత పాలన చేశాను, సన్యాసి జీవితం గడిపాను. నేను చెప్పిన మాటలు నిజమైతే, పాము విషం నిర్వీర్యమై పిల్లవాడు లేచి కూర్చోవాలి'' అంటూ సత్యక్రియను ఆచ రించాడు ద్వైపాయనుడు.

అలా ద్వైపాయనుడు ఒట్టు పెట్టుకోగానే యజ్ఞదత్తుడి గాయం నుంచి విషం బయటకు వచ్చింది. పిల్లవాడు కళ్ళు తెరచి తల్లిదండ్రులను చూసి ''అమ్మా'' అని కేకవేసి అలాగే ఉండిపోయాడు.

అప్పుడు కణ్హద్వైపాయనుడు పిల్లవాడి తండ్రితో ''నాశక్తికొలది నేను ప్రయత్నిం చాను. నీ ప్రయత్నం నువ్వు కూడా చెయ్యి'' అన్నాడు.

ఆ బ్రాహ్మణుడు పిల్లవాడి హృదయం మీద చెయ్యి ఉంచి, ''నా గృహానికి వచ్చే అతిథి అభ్యాగతులను చూసి ఎప్పుడూ నేను దానమీయలేదు. అందులో నాకు ఆనందం లేదు. శ్రమణులు, పండితులైన బ్రాహ్మణులు వచ్చినా సంతోషం లేకుం డానే ఆతిథ్యం నెరపాను. నా వాక్కు సత్యమైతే పాము విషం విరిగి పిల్లవాడు బ్రతుకుగాక!'' అన్నాడు.

అలాఅనగానే పిల్లవాడి నడుం నుంచి విషం బయటకు చిమ్మింది. యజ్ఞద త్తుడు లేచి కూర్చున్నాడు కాని నిలబడలేకపోయాడు. అప్పుడు ఆ బ్రాహ్మణుడు భార్యతో ''నేను చేయగలిగింది చేశాను. నువ్వు కూడా సత్యక్రియను ఆచరించు'' అన్నాడు.

''నేను సత్యం పలకాల్సిన విషయం ఒకటి ఉంది. మీ ఎదుట చెప్పలేను'' అందామె.

బ్రాహ్మణుడు ''అది ఏమైనా సరే, పిల్లవాడిని బతికించాల్సిందే'' అన్నాడు.

ఆమె తల ఊపింది.

''నిన్ను కాటేసిన పాము పట్లగాని, నీ తండ్రి పట్ల గాని నాకున్న అప్రియ త్వంలో తేడా లేదు. ఇద్దరి పట్లా ద్వేషమే నా హృదయంలో నిండి ఉంది. నా వాక్కు సత్యమైతే విషం విరిగి నీవు జీవించెదవు గాక!''

ఆమె అలా సత్యక్రియ నాచరించగానే పిల్లవాడు లేచి ఆడుకోవటం మొదలె ట్టాడు.

అప్పుడు బ్రాహ్మణుడు ద్వైపాయనుణ్ణి అడిగాడు, ''మనుషులు శాంతచిత్తులు, సహనశీలురు అయిన తర్వాతే పరివ్రాజక వృత్తిని, బ్రహ్మచర్యాన్ని గైకొనడానికి అర్హులు. ఎవరూ ఇష్టం లేకుండా చేయరు. అంత హేయమైన పనెందుకు చేశావు!''

''మొదట్లో శ్రద్ధగానే పరివ్రాజకుడినవుదామన్న ఇచ్ఛతోనే గృహస్థాశ్రమాన్ని త్యజించాను. అయితే వీడు గొర్రెలా వెళ్ళి తిరిగి వచ్చాడని జనం అంటారని లోకా పవాదానికి జడిసి, ఇష్టం లేకపోయినా ఇన్నాళ్ళూ సన్యాసి జీవితం గడిపాను, బ్రహ్మచర్య వ్రతదీక్ష కొనసాగించాను'' అని సమాధానమిచ్చా డాయన.

అప్పుడు ద్వైపాయనుడు బ్రాహ్మణుణ్ణి ''శ్రమణులు, బ్రాహ్మణులు, బాట సారులు - ఎవరు భిక్షకై వచ్చినా అన్న పానీయాలిచ్చి ఎంతో ఆదరిస్తావు కదా! నీ ఇంటికి అందరూ యధేచ్ఛగా వస్తారు. నువ్వు ఏ అపవాదభయాన ఇష్టం లేక పోయినా పుణ్యకార్యాలు చేస్తున్నావు?'' అని అడిగాడు.

''మా తాత, తండ్రి శ్రద్ధగా దానధర్మాలు చేసి ఎంతో పేరుపొందారు. ఆ పరం పర కొనసాగించాలనే కోరికతోనూ, అది నాతో అంతమైతే జనం నన్ను హేయంగా


చూస్తారన్న భీతితోనూ ఇష్టం లేకపోయినా దానాలిస్తున్నాను. ఆతిథ్యం నెరపుతున్నాను'' అని సమాధానమిచ్చాడు మాండవ్యుడు.

ఆ తర్వాత ఆయన భార్యనడిగాడు.

''పరిచయం లేని దానివీ, చిన్నదానివీ అయిన నిన్ను పరిణయమాడి నా ఇంటికి తీసుకువచ్చాను, నీకు ఇష్టం లేకపోయినా నాకు ఎంతో శ్రద్ధగా సేవలు చేస్తున్నావు. నీ మనసులోని అప్రియం నాకు కించిన్మాత్రం కూడా కన్పించలేదు. ఇదెలా జరిగింది భద్రే!''

''మా వంశంలో మొగుణ్ణి వదిలిపెట్టి పోవటం లేదు. ఆ సంప్రదాయం నిలుపుకోవాలనే కోరికా, విచ్ఛిత్తి నా వల్లనే వస్తుందేమోనన్న భయంతోనే ఇష్టం లేకపోయినా నీతో కాపురం చేశాను'' అని సమాధానమిచ్చి, ''పలుక కూడని పల్కులు పలికాను. నీ కొడుక్కోసమైనా నన్ను క్షమించు'' అందామె, ఆయన కాళ్ళమీద పడ్తూ.

మాండవ్యుడు ''లే, నిన్ను క్షమిస్తున్నాను. ఇవాల్టినుంచి నీ మనసులో కాఠిన్యముండరాదు. నేను కూడా నీ పట్ల అప్రియంగా ప్రవర్తించను'' అన్నాడు.



బోధిసత్వుడు బ్రాహ్మణుడితో ''శ్రద్ధలేని దానధర్మాలు వ్యర్థం. నేటినుంచి శ్రద్ధగా దానధర్మాలు చెయ్యి'' అని ఉపదేశమిచ్చాడు.

ఆయన సమ్మతించి బోధిసత్వునితో ''భంతే! మీరు మా దానాలకు క్షేత్రం. ఇష్టం లేని బ్రహ్మచర్య పాలన సరైందికాదు. నేటినుంచి మనఃపూర్వకంగా, సంతోషంగా బ్రహ్మచర్య వ్రతాన్నాచరించాలి మీరు'' అన్నాడు లేస్తూ.

''అలాగే'' అన్నాడు ద్వీపాయనుడు.

భార్యాభర్తలు తాపసికి వీడ్కోలు పలికి తమ ఇంటికి వెళ్ళిపోయారు.

***

జాతక కథలను టి.వి. వాళ్ళు సీరియల్‌గా ప్రసారం చేస్తున్నారు. అది ఆనాటి ఎపిసోడ్.

టి.వి. కట్టేసింది సునంద.

''ఊహూ ఇది సమస్యకు పరిష్కారం కాదమ్మాయి! ద్వీపాయనుడు ఇష్టంలేని సన్యాసం, బ్రహ్మచర్యం విడిచి గృహస్థు అయితే బావుండేదేమో. మాండవ్యుడు దానధర్మాలు మానేస్తేనూ, ఆయన్ను భార్య వదిలేస్తేనూ సరైన పరిష్కారాన్ని సూచించటమవుతుంది. మళ్ళీ అవే పనులు సక్రమంగా నిర్వహించండి అని బుద్ధి గరపటం హేతు రహితమైన పరిష్కారం'' అన్నాడు రాజశేఖరం.

''కానీ మానవ జీవిత గమ్యాలు సమాజపు విలువల ననుసరించి ఉండాలి అని సూచించటమే ఆ ముగింపు మామయ్యా! ప్రతి సమాజానికి కొన్ని విలువలుంటాయి, వాటిని చేరుకునేందుకే ఆనాటి సమాజం పరిష్కారాలు సూచిస్తుంది. బౌద్ధం ఉద్ధృతంగా ఉన్న రోజుల్లో సమ్యక్ సంబుద్ధులైన పరివ్రాజకులు కావాలి. సన్యాసులకు ఆతిథ్యమిచ్చి దానధర్మాలు నెరపే శ్రద్ధాళువులైన గృహస్థులు కావాలి. గృహస్థాశ్రమం అవిచ్ఛిన్నంగా సాగిపోవాలి. ఆనాటి సమాజానికి అదే సరైన పరిష్కారం'' అంది సునంద.

''నేనొప్పుకోను. సామాజిక విలువల పరిరక్షణా యజ్ఞంలో మనుషులను బలి పశువులను చేయడం అసంగతమైన పని. నిజానికి సార్వకాలీన, సార్వజనీన సూత్రాలు, సత్యాలూ, విలువలూ అంటూ ఏంలేవు. ప్రతి యుగం తన సమస్యను సృష్టించుకున్నట్లే తనకు సరిపోయే పరిష్కారమార్గాలను వెదుక్కుంటుంది. అక్కడా మనిషి బలిపశువే అయ్యాడు. వ్యక్తికి కూడా సరిపోగలిగే సామాజిక సూత్రాన్ని ఇప్పటికీ కనుక్కోలేకపోవడం ఎంత విషాదకరం!''

''వ్యక్తి, సమాజం రెండూ భిన్నధృవాలు. మరి మనిషికేం స్వేచ్ఛ ఉంటుంది మామయ్యా! పుట్టినప్పటినుంచి మనిషి మానసం సామాజిక విలువల చట్టంలో రూపుదిద్దుకున్నా తాను స్వతంత్రంగా ఉన్నట్టు భ్రమించడం లేదా! నిజానికి మనిషి సామాజిక విలువల దర్పణమైన తన మానసానికి బానిస. ఇవాళ మన మనుకుంటున్నాం మనిషి స్వతంత్రుడు. ఏ లోకోపవాదానికీ వెరవాల్సిన పనిలేదని, కానీ, తన మనసు దిద్దుకున్న లోకోపవాద ముద్రను అధిగమించటం మనిషి కసాధ్యం''.

రాజశేఖరమేమి చెప్పేవాడే కాని, అంతలో మహేంద్రుడు ''తాతయ్యా! ఓసారి ఇట్రా. నాకీ లెక్క తెలియటం లేదు, చెప్పు'' అని పిలవడంతో ఆయన లేచి మనవడి గదిలోకి వెళ్ళాడు.

సునంద మనసు ఆలోచనలో పడిపోయింది. అప్పుడు ఏడేళ్ళక్రితం సురేంద్ర నుండి ఉత్తరం వచ్చినప్పుడు తనకేదిక్కూ తోచలేదు. నిరాశా నిస్పృహలు తన్ను విచలితురాల్ని చేశాయి. నిస్సహాయత తన్ను చుట్టుముట్టింది. అంతకు సంవత్సరం క్రితం కంపెనీ వాళ్ళు సురేంద్రను ట్రైనింగ్ నిమిత్తం అమెరికా పంపారు. మొదట ఆరునెలలే అన్నారు. ఆ ఆరు నెలల్లోనే అతను అక్కడ స్థిరనివాసం ఏర్పరుచుకునే ప్రయత్నం చేశాడు. ఇండియాలో తను పనిచేస్తున్న కంపెనీకి అక్కడినుండే రాజీనామా పంపాడు. ఎవరో లిజాట. ఆమెని ప్రేమించాడు. పెళ్ళిచేసుకున్నాడు. మొదట్లో అతను రాసినట్లే ట్రైనింగ్ పొడిగించారని తననుకుంది. కానీ జరిగింది వేరు. ఉత్తరంలో అతను రాసిన విషయాలు తన హృదయాన్ని ముక్కలుచేశాయి. ''నేను లిజాను ఎలా ప్రేమించానో, ఎలా ఆమెను పెళ్ళి చేసుకున్నానో, అవన్నీ ఇప్పుడు నీకు చెప్పి ప్రయోజనం లేదు. ఇక్కడి జీవితం నాకు నచ్చిందో, ఆమె మనస్సు నన్ను ఆకర్షించిందో, ఏమయిందో నేను చెప్పలేను. నీమీద ఇవాల్టికీ ప్రేమ పోలేదని, మన దాంపత్య జీవితంలో మాధుర్యం లేక

పోలేదని ఇప్పుడు చెప్పి ప్రయోజనం లేదు. ఇంకా నిన్ను మోసగించడం నాకు ఆత్మగ్లాని కలిగిస్తోంది. నాన్న మొహం చూసే ధైర్యం నాకు లేదు. అందువల్ల ఇంక ఇండియాకు తిరిగి రాను. నా జీవిత గమ్యాన్ని నేను నిర్ణయించుకున్నట్టే, నువ్వూ నీ జీవితాన్ని నిర్ణయించుకోవచ్చు. మళ్ళీ పెళ్ళి చేసుకోవాలంటే చేసుకోవచ్చు. నేను మార్గాలు సూచించి నిన్నవమానించటం నా కిష్టం లేదు. నాన్న బాధ్యత నాదే. కానీ ఆయనకు నా సూచనలు ఆమోదయోగ్యాలు కావు. అందుకే ఆయనకో నమస్కారం పెట్టటం తప్ప, ఆయనకేం సంజాయిషీలు ఇచ్చుకోవాలని నాకన్పించటం లేదు. ఇక మన అబ్బాయి మహేంద్రుడి విషయంలో కూడా నేనేం చేయలేని అశక్తుడినే. నా చేతనయింది డబ్బు పంపడం, అది చేస్తాను. మీరు స్వీకరిస్తే ధన్యుడని భావిస్తాను. నా స్వార్థం నేను చూసుకున్నానని, వాగ్దానాలు భంగం చేశానని, నా హృదయం కరడు కట్టుకుపోయిందని మీరు నిందిస్తే, అందులో నేను అహంకరించవల్సింది కానీ, సంజాయిషీ ఇచ్చుకోవాల్సింది కానీ ఏంలేదు. ఎందుకంటే అదంతా నిజమే కనుక. కనీసం ఇకనుండైనా సత్యపు వెలుగులో బతుకుదామన్న ఆలోచనతో ఈ మాటలు రాస్తున్నాను''.

తనా ఉత్తరం మామయ్యకు చూపలేదు. ఆయన బాధపడిపోతాడు. సాగినంత కాలం ఆయన్నీ భ్రమలోనే ఉండనీ, కొడుకు ఇంకా అమెరికాలో ట్రైనింగ్‌లో ఉన్నాడనే అనుకోని అని తను చెప్పలేదు. కానీ ఆ విషయం ఎక్కువకాలం దాగలేదు. వారం రోజుల్లోనే సురేంద్ర తండ్రికి డబ్బు పంపుతూ తన విషయం రాసాడు. ఆయన ఆ డబ్బు తీసుకోలేదు. వాపసు చేశాడు. 'తమ మధ్య బంధం తెగిపోయిందని, తనకింక ఉత్తరాలు రాయవద్దనీ' రాశాడు. ఇదంతా తనకు తర్వాత తెలిసింది. తను బాధపడిపోతుందని ఆయన తనకీ విషయం చెప్ప లేదు. ఆ ఉత్తరం వచ్చిన తర్వాత ఆయన మనఃస్థితి తన మనఃస్థితి కంటే దుర్భరంగా తయారయింది. ఎవరికీ చెప్పలేని గుండెలమీద కుంపటిని భరించాడాయన. భార్యపోయింది. కూతురి పెళ్ళి చేశాడు. ఆమె సంసారం సుఖంగానే ఉంది. కొడుక్కీ పెళ్ళిచేశాడు. తన చిన్నప్పటి మిత్రుడి కూతుర్నే కోడలుగా తెచ్చుకున్నాడు. సురేంద్ర కూడా తనంటే అభ్యంతరం చెప్పలేదు. ''రెండేళ్ళు ఆగరా, అదింకా చదువు పూర్తి చేయలేదు'' అని తండ్రి అభ్యంతరం చెప్పినా, ఆయన ''పెళ్ళయింతర్వాత కావాలంటే చదువుకుంటుంది లేవోయ్. మేమిక్కడ ఆడసాయం లేక ఇబ్బంది పడిపోతున్నాం'' అన్నాడు.



తను ఇంటర్మీడియట్‌తోనే చదువుకు స్వస్తి పలకాల్సి వచ్చింది. తన కలలు పండలేదు. తను కాపరానికి వచ్చేటప్పటికి తన వయసు పద్దెనిమిదేళ్ళు.

అప్పటికింకా మామయ్య ఉద్యోగం చేస్తూనే ఉన్నాడు. కొడుకు, కోడలు – మరుసటి ఏటికి మనమడు మహేంద్రుడితో ఆయన మనసుకు కొంత ఊరట కలిగింది. భార్యపోయిన దుఃఖం ఆయన కొంత మర్చిపోగలిగాడు. తమ పెళ్ళయిన రెండేళ్ళ లోపలే సురేంద్ర అమెరికాకు ట్రైనింగ్‌కు వెళ్ళటం, ఆపైన అతను తండ్రికి ఇక తాను ఇండియా రానని రాయడంతో ఆయనకు జీవించాలనే ఇచ్ఛ నశించింది. తనేం చేయాలన్నదే ఆయనకు పెద్ద ప్రశ్న అయింది. ఆ ఉత్తరం వచ్చిన నెలరోజుల తర్వాత ఆయన ప్రవర్తన మారిపోయింది. ఆయన మనసులో ఏం మథన పడేవాడో గాని, తన ఎదుట అది ప్రదర్శించేవాడు కాడు. ఏం జరుగనట్టే ఉండేవాడు. అంత ఉల్లాసం, ఉత్సాహం ఆయన ప్రదర్శించక పోయినా తను గుర్తుపట్టలేదు. అంతకుముందు ఇంటి పనులేమీ చేయని మనిషి మొత్తం బాధ్యతను స్వీకరించాడు. కూరలు తేవటం దగ్గర నుంచి అన్ని పనులు ఆయనే చేసేవాడు. ఆయన మనసు ఆత్మగ్లానితో మ్లానమైంది. తన కొడుకు చేసిన తప్పిదానికి తాను ప్రాయశ్చిత్తం చేసుకున్నట్లుండేది ఆయన ప్రవర్తన.

తను ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉంది. తన భర్త విషయం మామయ్యకూ చెప్పలేదు, తన తండ్రికీ ఉత్తరం రాయలేదు. ఓ రోజు భోజనం చేసేటప్పుడు మావయ్య అడిగాడు ''అమ్మాయి! మనిషి తను భవిష్యత్‌లో ఇది చెయ్యాలి, అది చెయ్యాలి అని కలలు కంటూ ఉంటాడు నీకలాంటి కలలు ఏమయినా ఉన్నాయామ్మా?'' అని.

తను ఆశ్చర్యపోయింది. ''నాకా, కలలా.... ఇప్పుడా?'' అంది.

''ఇప్పటి సంగతికాదు, నీ పెళ్ళికానప్పటి ముందు సంగతి. నేను కలలు కనేవాడిని. నా చిన్నప్పుడు బొమ్మలు గీసేవాడిని. బాగానే గీసేవాడి ననుకుంటాను. మంచి చిత్రకారుడినవాలని, చిత్రలేఖనంలో కృషి చెయ్యాలని అనుకునేవాడిని. ఓసారేమయిందో తెలుసా, అద్దంలో నా ప్రతిబింబం చూసుకుంటూ నా బొమ్మ నేనే గీసుకున్నాను, స్కెచ్ పూర్తయ్యింది. స్నానం చేసి వద్దామని బాత్‌రూంలోకి వెళ్ళాను. నేను తిరిగొచ్చేసరికి మా నాన్న ఆ బొమ్మకింద 'కోతి' అని రాస్తున్నాడు. ''అదేమిటి నాన్నా!'' అనడిగాను. ''పేరు రాయకపోతే అదేదో గుర్తుపట్టటం కష్టం కదా! అందుకనే రాస్తున్నాను'' అన్నాడాయన. నిజానికాబొమ్మ కోతిలా లేదు. నా ప్రతిబింబం బాగానే వచ్చింది. నేను చదువు అశ్రద్ధ చేస్తున్నానని, అర్థం లేని పనులు చేస్తున్నానని సూచించటమది. ఆయన కొచ్చే కొద్ది జీతంతో నన్ను పెద్ద చదువు చదివించాలని ఆయన ఆశిస్తున్నాడు, కష్టపడుతున్నాడు. నాకా విషయం తెలుసు. అందుకే ఆయన పైకి చెప్పకపోయినా ఆయన ఆశించిన తీరున చదవ ప్రయత్నించాను. అలా అని నేను నష్టపోయానని చెప్పటం లేదు. అలా కల భగ్నమైందని చెప్పటమే నా ఉద్దేశం''.

ఇన్నిమాటలు ఆయన ఎప్పుడూ తనతో మాట్లాడలేదు. తను సంకోచంతో మౌనం వహించింది.

''ఆ తర్వాత ఉద్యోగమొచ్చింది. పెళ్ళయింది. స్వతంత్ర జీవితం ఆరంభించాను. నా కళాతృష్ణ తీర్చుకోవాలనే మరో ప్రయత్నం చేశానప్పుడు. రంగు ట్యూబులు, కాన్వాసు తెచ్చాను. పెయింటింగ్‌ను గురించిన పుస్తకాలు కొన్నాను. ఇంక స్టాండూ, ఈజెల్ తెచ్చుకోవడమే తరువాయి, అప్పుడేమైందో తెలుసా?''

''ఏమయింది?'' అడిగింది తను కుతూహలం పట్టలేక.

''నేను ఆఫీసునుంచి వచ్చేసరికల్లా ఇల్లు కళకళలాడిపోతున్నది. మీ అత్తగారు నా పెయింట్ ట్యూబులతో ఇంట్లో ముగ్గులు పెట్టింది. గుమ్మాలకు పసుపు రంగు పట్టించింది. నీలం, ఎరుపు, పచ్చరంగుల్తో తీగలు, పూలు వేసింది. ఏ రంగు ట్యూబూ వదల్లేదు. పైగా 'ఈ నల్ల రంగెందుకు తెచ్చారు. అశుభం అంది' అమాయకంగా''.

తను నవ్వేసింది.

''నేను మళ్ళీ అంత డబ్బుపెట్టి రంగులు కొనలేకపోయాను. ఆ రోజుల్లో నా ఆర్థిక పరిస్థితే అంతంతమాత్రం. నాకు కోపమొచ్చింది. ఆవిడతో మాట్లాడ లేదు''.

ఆయన చెప్తుంటే భార్య స్మృతి ఆయన మదిలో మెదిలి ఆయన కళ్ళు చెమర్చడం తనకు కన్పించింది

''ఆ రోజేమయిందో తెల్సా. ఆమె 'సారీ మీరు బొమ్మలు వేయడానికి ఆ రంగులు తెచ్చుకున్నారని అనుకోలేదు. నేనూ రెండుబొమ్మలు వేశాను చూస్తారా'' అంది. నేను ఆశ్చర్యపోతూ 'ఏవీ చూపించు' అన్నాను. ఆమె ముందు గదిలో ఆడు

కుంటున్న మా పిల్లల్ని చూపింది'' ఆయన కంఠం గద్గదికమవటంతో ఆపైన మరేం మాట్లాడలేక పోయాడు.

ఓ క్షణమాగి, ''నిజానికా ట్యూబులెందుకో ఆమెకు తెలియకపోలేదు. అవి బాగా ఎక్స్‌పెన్సివ్ అని మాత్రం తెలీదు. ఇంటిని అలంకరించాలన్న ఉత్సాహాన్ని ఆపుకోలేకపోయింది. అయిపోతే మళ్ళీ తెచ్చుకుంటానులే అనుకుంది ఆమె... చూశావా? నాగోడు చెప్తున్నాను గానీ నీ సంగతే విచారించడం లేదు. చెప్పు... నువ్వు కన్నకలలు ఏమయినా ఉన్నాయేమే''.

తను సిగ్గుపడిపోయింది. డాన్సు నేర్చుకోవాలని ఉండేది. కాళ్ళు ఉత్సాహంతో నర్తించేవి. డాక్టర్ కోర్సు చదువుదామని ఉండేది. అక్కడికీ ఇంటర్మీడియట్‌లో బైపిసి గ్రూపే తీసుకుంది. కానీ అన్నిటికీ ఆర్థిక ఇబ్బందులు ఒక కారణమైతే, పెళ్ళితో చదువుకు స్వస్తి పలకటమైంది.

''డాక్టరవాలని ఉండేది నాకు'' అంది తను సంకోచంగా.

''అప్పుడది తీరలేదు. కానీ ఇప్పుడు మాత్రం ముంచుకుపోయిందేముంది. నువ్వు ఎంబిబిఎస్ చదవాలి'' అన్నాడాయన.

''ఇప్పుడా, ఈ వయసులోనా...''

''నీకంత వయసేముందమ్మా, నిండా ఇరవయ్యేళ్ళు కూడా లేవు''

ఆ తర్వాత తను 'ఎంసెట్'కి కోచింగ్ తీసుకోవడం, శ్రద్ధగా చదవడం జరిగింది. మామయ్య తనకు ఎంతో ఆసరా ఇచ్చాడు. తన చదువుకి అంతరాయం కలుగుతుందేమోనని మహేంద్రుడి సంరక్షణంతా ఆయనే చూసేవారు. పిల్ల వాడికి పాలుకూడా ఆయనే కలిపి పట్టేవాడు. తనూ జీవితంలో ఏదన్నా సాధించాలన్న దీక్షతో చదివింది. రెండేళ్ళ తర్వాత మళ్ళీ చదువు మొదలెట్టడం తనకూ కష్టమే అయింది.

తనకు ఎంసెట్‌లో మంచి రాంకే వచ్చింది. ఎంబిబిఎస్ మొదటి సంవత్సరమైన తర్వాత, తన్ను సురేంద్ర వదిలేశాడని తెల్సి తన తండ్రి వచ్చాడు. అప్పటిదాకా తామిద్దరిలో ఎవరూ సురేంద్ర ప్రస్తావన చెయ్యలేదు. ఎవరికి వాళ్ళు గుంభనంగా ఉండిపోయారు. అయితే సురేంద్ర మరింక రాడని తమిద్దరికీ తెలుసునని తామిద్దరికీ తెల్సు.

తన తండ్రి రావటమే దూకుడుగా వచ్చాడు. వచ్చీ రావడంతోనే మామయ్యాను, సురేంద్రనూ కలిపి తిట్టటం మొదలెట్టాడు. తన కూతుర్ని మోసం చేశారన్నాడు. ఇందులో తండ్రీ కొడుకులిద్దరికీ భాగస్వామ్యం ఉందన్నాడు. తనకీ విషయం ఎందుకు తెల్పలేదన్నాడు.

''నీ కొడుకు లేకపోతే అదేం చేస్తుంది ఇక్కడ. దాన్ని తీసుకు వెళ్తాను నాతో. నీ ముఖం నాకిక చూపించకు'' అన్నాడు.

మామయ్యేం మాట్లాడలేదు, నవ్వాడు.

''ఎందుకురా నవ్వుతావు. సిగ్గులేని ముఖానికి నవ్వే సింగారమన్నట్టు నా కూతురి జీవితం ఇలా నాశనం చేశామని మురిసిపోతున్నారా మీ తండ్రీ కొడుకులు? వెళ్ళు నువ్వూ అమెరికాకు. మా అమ్మాయిలా కాదు, నిన్ను తన్ని తగలేస్తుందా కోడలు''.

''నువ్వేమయినా అను. తప్పు నాది కాబట్టి, నువ్వేమన్నా నాకు భరించక తప్పదు. అయితే, అమ్మాయిని నీతో పంపటం కల్ల. నా చేతనైన పద్ధతిలో అమ్మాయి జీవితం తీర్చిదిద్ద ప్రయత్నిస్తున్నాను. నువ్వు సహకరిస్తే సంతోషిస్తాను''.

''నిన్నడిగేదేమిటి? పదవే అమ్మా, ఆ ముదనష్టపు కొంపలో మనమో క్షణముండొద్దు'' అన్నాడాయన తన్ను ఉద్దేశించి.

''నాకిక్కడ బాగానే ఉంది నాన్నా! ఎంబిబిఎస్‌లో జాయినయ్యాను. మామయ్య నన్ను బాగానే చూసుకుంటున్నారు'' అంది తను.

అప్పుడు ఆశ్చర్యపోవడం తన తండ్రి వంతయింది.

''క్షమించరా, నా కూతురి జీవితం అలా అవడం భరించలేక నిన్ను అంతలేసి మాటలన్నాను. నువ్వు అమ్మాయి యోగక్షేమాలు ఇంత విచారిస్తావని నేననుకోలేదు''.

''ఇందులో నువ్వు క్షమాపణలు చెప్పుకోవలసింది ఏం లేదు. మనిషి ఏ పని చేసినా స్వార్థంతోనే చేస్తాడని నా నమ్మకం. పసి పిల్లవాడికి చాక్లెట్ ఇస్తే ఆ తర్వాత పిల్లవాడు అది ఇచ్చిన వ్యక్తితో కూడా దాన్ని భాగం పంచుకో నిరాక రిస్తాడు. మరికొంచెం ఎదిగిన తర్వాత తన తమ్ముడికి, చెల్లెలికి, తండ్రికి, తల్లికి తనకు చెందిన వస్తువును ఇవ్వగలిగే స్థాయికి ఎదుగుతాడు. ఆ తర్వాత చాలామందిలో ఎదుగుదల కుంటుపడిపోతుంది. తన పనితోపాటు ఇతరుల పని కూడా అయితే సంతోషించే స్థాయికి వస్తాడు. నేను బతికినతీరును సింహావలోకనం చేసుకుంటే నాకెక్కడా నేను స్వార్థాన్ని విడనాడి పనిచేసినట్టు కనిపించదు. నా భార్య పోయింది. మాకు ఆడసాయం కావలసిన అవసరం ఏర్పడింది. ఎక్కువ చదువుకోకపోయిన, ఇంటిపట్టున వుండి వంటా వార్పూ, గృహ కార్యనిర్వహణ చేసే పిల్ల కోడలైతే బాగుంటుందనుకున్నాను. అలాంటి అమ్మాయి నా బాల్యమిత్రుడి కూతురైతే నాకానందమే. నువ్వు ఆనందంగా ఉండడం నా స్వార్థం. సురేంద్ర మమ్మల్ని వదిలేశాడు. అది వాడి స్వార్థం. అందుకే నేను వాడిని తప్పుపట్టను. కానీ, అందువల్ల అమ్మాయి నష్టపోయింది. నేను తప్పుచేశానన్న ఆత్మగ్లాని నాలో కలిగింది. ఇది నా చేతనైన పద్ధతిలో సరిదిద్దాలి. లేకపోతే, నా మనసుకు నేను నచ్చచెప్పుకోలేను. అందుకే అమ్మాయిని పైకి చదవమని ప్రోత్సహించాను. ఇందులో కొంత రిస్కీ వుంది. రేపామె ఎదిగి తనదోవ తను చూసుకోవచ్చు. నన్ను ఒంటరిగా వదిలి వెళ్ళిపోవచ్చు. ముసలితనంలో వున్న ఆసరా కూడా పోవచ్చు. ఆమెను గురించి పట్టించుకోకపోయినా ఇది జరగవచ్చు. నాకలా ఆసరా ఇవ్వాలని ఆశించడం నా స్వార్థం. అయితే, భవిష్యత్తును గురించి భయపడుతూ నా చేతనైంది నేను చేయకపోతే నన్ను నేను సమాధాన పరుచుకోలేను. ఇది నా గురించి నేను చేసుకున్న విశ్లేషణ. ఇతరుల గురించీ నా అభిప్రాయమిదే.''

''నీ ముఖంలే. మాట్లాడక, నీకు స్వార్థమా?''

''మనిషి ఈ ప్రపంచంలో తను సుఖంగా బతకాలంటే ప్రథమంగా అవసరమైంది మానవుల అనివార్య స్వార్థపరత్వాన్ని గుర్తించడం. ఇతరులు నీ కోర్కెలు తీర్చడం కోసం తమ కోర్కెలను త్యాగం చెయ్యాలనడం మహా అసంగతమైన పని. నువ్వు ఇతరులను స్వార్థరహితంగా వుండమని అడుగు తున్నావు. వాళ్ళలా ఎందుకుండాలి? ప్రపంచంలో ప్రతి వ్యక్తీ తనకొరకే అనే నిజంతో నువ్వు రాజీపడినపుపడు, నీ చుట్టూ వున్నవాళ్ళనుంచి నువ్వడిగేది అతి స్వల్పం. వాళ్ళు నిన్ను నిరాశపర్చరు. నువ్వు వాళ్ళను మరింత సద్భావంతో పరికిస్తావు'' నాన్న మాటలు వినకుండానే మామయ్య చెప్పుకుంటూ పోయాడు.

ఆ తర్వాత ఎప్పుడో మాటల సందర్భంలో తను మామయ్యను అడిగింది. ''మనిషి మనుగడకు స్వార్థమే పునాది అన్నారు మీరు. భార్యాభర్తల సంబంధంలో కూడా ఆత్మార్పణ భావం వుండదా, మామయ్యా?'' అని.

ఆయనతో ఏ విషయాన్నైనా స్వేచ్ఛగా మాట్లాడవచ్చు. ఆయన స్వతంత్రమైన మనిషి, తన స్వాతంత్ర్యానికి ఎవరు అడ్డు పెట్టదల్చినా సహించలేని మనిషి, అలాగే ఇతరుల స్వాతంత్ర్యం విషయంలోనూ తను తలదూర్చని మనిషి ఆయన. ''ఏ ఇతర సంబంధంలో కంటే భార్యాభర్తల సంబంధం మరింత ఆత్మీయమైనది. శారీరకంగానా, మానసికంగానా? శారీరక వాంఛాపరితృప్తి మనసుల సన్నిహితత్వానికి దారి తీస్తుందేమో. మనసుల సాన్నిహిత్యం ఏ ఇద్దరి వ్యక్తుల మధ్యనైనా ఉండవచ్చు. వాళ్ళు భార్యాభర్తలే కావలసిన అవసరం లేదు. ఆత్మార్పణ భావం కూడా స్వార్థాన్నుండే ప్రభవించిందని నా అభిప్రాయం. అంతదాకా ఎందుకు, నా భార్యకు ప్రపంచంలోకెల్లా తను ప్రేమించగలిగిన రెండో వ్యక్తిని నేనే. దాని ఆధార భూమిక ఏదైనా అంతగా ప్రేమింపబడటం నా అదృష్టంగా నేను భావిస్తాను. అందుకే ఇప్పటికీ ఆమెను తల్చుకున్నప్పుడల్లా నా కళ్ళు తడి అవుతాయి. నా కూతురికిప్పుడు తన సంసారం తప్ప నాన్న ఎప్పుడో కాని గుర్తురాడు. కొడుకు నా గూర్చి తలచుకోకూడదనే నిర్ణయం తీసుకున్నాడు. ఆమె లేని తనంలోని

## కథావస్తువు మనుషుల్లోని స్వార్థమే!



భావసామ్యం సన్నిహితత్వానికి దారి తీస్తుంది. తన భావాలే మరో వ్యక్తి వ్యక్తపరుస్తున్నప్పుడు ఏ వ్యక్తి అయినా అప్రతిభుడవటం సహజం. అది ప్రభావానికి నాంది. ఆ ప్రభావం 'నిస్వార్థం' కథలో చాలా స్పష్టంగా కనిపిస్తుంది. నిజానికి ఈ కథ పేరు 'నిస్వార్థం' అయినా అందులోని వస్తువు స్వార్థమే! స్వీయ ఆసక్తుల సరిహద్దుల్లో మనిషి ఎంతమేరకు నిస్వార్థంగా ఉండగలడో చూపటమే ఈ కథ ఉద్దేశం.

**-కాకాని చక్రపాణి**

**9000611409**

శూన్యత్వం ఇప్పుడు నాకు బాగా అనుభూతమవుతున్నది. ఆత్మీయబంధానికి ఆత్మార్పణ అవసరం లేదు. నిజానికి ఎవరూ అలా చేయలేరు కనుక''.

''మీరు రెండో వ్యక్తన్నారు. ఆమె అంతగా ప్రేమించిన మొదటి వ్యక్తి ఎవరు?''

''ఆమే...''

రోజులు దొర్లిపోతున్నాయి. సురేంద్ర తలపే మనసులోకి వచ్చేది కాదు. తామెప్పుడూ అతన్ని గురించి చర్చించేవాళ్ళు కారు. ఒకోసారి మావయ్య తన కొడుకు ప్రవర్తనను జస్టిఫై చేయడం కోసమే తనకీ ఫిలాసఫీ అంతా బోధించాడా అని అన్పించేది. తన కొడుకు ప్రవర్తనను తను తప్పుగా పరిగణించకపోవడం ఆయన స్వార్థమూ, కొడుకు పట్ల మమకారమా అన్పించేది. ఒకోసారి ఆయన ఆలోచనలన్నీ ట్రాష్ అన్పించేవి. తన స్వభావాన్నుండి పైకెదగ ప్రయత్నించే మనిషిలోని తపన ఆయనలో గోచరమయ్యేది తనకు.

మహేంద్రుడి చదువు విషయంలో తామిద్దరూ శ్రద్ధ తీసుకునేవాళ్ళు. తనకంటే ఆయనే వాడి విషయం ఎక్కువగా పట్టించుకునేవాడు. తాతా మనమళ్ళు స్నేహితుల్లాగా కబుర్లు చెప్పుకునేవాళ్ళు. ఆడుకునే వాళ్ళు. తన తండ్రి అమెరికాలో ఉన్నాడన్న విషయం తప్ప మరేం తెలీదు వాడికి.

రెండేళ్ళుగా సుధాకరం తన మనసు నాకర్షిస్తున్నాడు. తనకంటే ఒకటి రెండేళ్ళు చిన్నవాడే అతను. తన భర్తను గురించిన మనోవ్యథను దూరం చేయడంలో అతను పరోక్షంగా సాయపడ్డాడు. అయితే, అతని విషయం మావయ్యకు చెప్పడానికి తను సందేహించింది. ఆయన ఎలా భావిస్తాడో అనుకుంది. ఓసారి ఫైనలియర్ సర్జరీ ప్రాక్టికల్స్‌లో తను హాస్పిటల్‌లోనే బాగా ఆలస్యమైంది. అది చాలా కాంప్లికేటెడ్ సర్జరీ కేసు. తనను సుధాకర్ ఇంటిదగ్గర డ్రాప్ చేస్తానన్నాడు. తను వద్దంది.

''ఏం ఫర్లేదు, పదైపోయింది. మీరు ఒంటరిగా ఎలా వెళ్తారు. మరేం చెప్పక పదండి'' అన్నాడతను.

తామింటికి చేరే సమయానికి మావయ్య వరండాలో నిలబడి తనకోసం ఎదురు చూస్తున్నాడు. ఆయన్ని చూడగానే తనకేదో తప్పుచేసిన అనుభూతి కలిగింది. తడబడుతూనే ''మావయ్యా! ఇతను సుధాకర్. నా క్లాస్‌మేట్. సర్జరీ కేసులో బాగా ఆలస్యమైంది. ఇతను డ్రాప్ చేస్తానంటే...'' అంది తను.

''ఫైన్! అమ్మాయిని సురక్షితంగా ఇంటికి చేర్చావు. కృతజ్ఞతలు రా, లోపలికి, భోజనం చేసి వెళ్దువుగాని'' అని అతన్ని ఆహ్వానించాడాయన.

''లేదండీ, ఇంటికి వెళ్ళిపోవాలి. ఆలస్యమైపోయింది'' అన్నాడతను నిరాకరిస్తూ.


''నా చేతివంట తినడానికి భయపడుతున్నట్టున్నావు. నలభీమపాకం కాకపోయినా ఫర్లేదు, తినబులే''.

''అలా అని కాదు, పనుంది. వెళ్ళిపోవాలి'' అని క్షమాపణలు చెప్పి వెళ్ళిపోయాడతను.

ఆ తర్వాత ఓసారి అడిగాడు సుధాకర్.

''ఎవరాయన? మావయ్య అంటే మీ అమ్మ తమ్ముడా, అన్నా?''

''మామగారు! ఫాదరిన్లా...'' అని చెప్పింది తను. ముసుగులో గుద్దులాట అనవసరం. అతను పారిపోదలచుకుంటే వీలైనంత వెసులుబాటు అతనికివ్వడం అవసరం.




''అంటే మీకు పెళ్ళయిందా?''

''అయింది, ఓ బాబు కూడా...''

''ఎప్పుడూ మీరీ విషయం చెప్పలేదు నాకు?''

''మీరడగలేదుగా!''

''బావుంది. ఎవరు మాత్రం ఊహించగలరు!''

తనింక తన కథంతా చెప్పింది సుధాకర్‌కు. అంతా విని మరేం మాట్లాడకుండా వెళ్ళిపోయాడతను. నెలరోజులు తనను తప్పించుకు తిరగలేదు గాని ముభావంగా వున్నాడు. తనుకూడా అతన్నేం ప్రోత్సహించలేదు.

ఓసారి మావయ్యే అడిగాడు ''ఆ సుధాకరం మళ్ళీ ఎప్పుడూ కనబడలేదమ్మా'' అని.

''అతనికి పనేముంది మావయ్య ఇక్కడికి రావడానికి. ఆ రోజంటే ఆలస్యమైందని నన్ను ఇంటి దగ్గర డ్రాప్ చెయ్యడానికి వచ్చాడు''.

''నిజమదే అయితే నేను మరేం ప్రశ్నించను''.

తనేం మాట్లాడలేదు. మనసులో అపరాధ భావన రంపపుకోత కోసింది.

ఆ మర్నాడు నాకు చెప్పాడు మావయ్యా ''అతను స్కూటర్‌మీద పోతూ కన్పించాడు. ఇవాళ రాత్రికి భోజనానికి రమ్మని ఆహ్వానించాను''.

''ఎవరు?''

''సుధాకర్''.

ఎందుకు పిల్చారని తనాయన్ని అడగలేదు. తనను ఆయన పరీక్షిస్తున్నాడా అనిపించింది. సురేంద్రకు తను పనికిరాలేదు, వద్దనుకున్నాడు. అందువల్ల సురేంద్ర విషయంలో తనకేం ఆత్మగ్లాని కలగలేదు. కాని తన కొడుకు మహేంద్రుడి విషయంలోనే తాను సమాధానపడలేక పోయింది.

ఆరోజు రాత్రి భోజనాలప్పుడు ఆ మాటలు, ఈ మాటలు కల్పించుకుని మావయ్యే మాట్లాడాడు. ''రేపు ఎంబిబిఎస్ అయిపోతే అలాగే ఆగిపోతావా లేక పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేస్తావా?'' అనడిగారు.

''చెయ్యాలనే ఉందండీ. ఎం.డి. జనరల్ మెడిసిన్ చేద్దామని వుంది''.

''మా అమ్మాయేం చెయ్యాలనుకుంటోంది?''

''తననే అడగండి''

తనేం మాట్లాడలేదు.

''ఎం.ఎస్. జనరల్ సర్జరీ చేస్తే ఎలావుంటుంది. లేకపోతే గైనిక్ ఆబ్‌స్టెట్రిక్స్ చేస్తే... ఇది సూచన మాత్రమే. అప్పుడు ఇద్దరూ ఓ నర్సింగ్ హోం పెట్టుకోవచ్చు. భావి జీవితానికి ముందే ప్రణాళిక వేసుకోవడం మంచిది''.

సుధాకర్, తనూ అవాక్కై వుండిపోయారు.

''మీరు నాకేం చెప్పలేదు. అయినా, ఇంత వయసు వచ్చిన వ్యక్తిని, ఎంతోమంది మనుషుల్ని చూసిన వ్యక్తిని నేను. మనుషులనంచనా వేయడంలో ఘనాపాఠిని కాదు కానీ, కొంతవరకు నా అంచనాలు తప్పవని నేను తెల్సుకున్నాను. కళ్ళలో మెరుపులు, మాటల్లో తడబాటు – ఒకటేమిటి మన ప్రతిజెశ్చర్ మనని వ్యక్తీకరిస్తూనే వుంటుంది. మీకిద్దరికీ కొన్నిసందేహాలున్నాయి. కొంత సంకోచముంది. వాటిని గురించి మీ అంతట మీరు డిస్కస్ చేసుకుని నిర్ణయం తీసుకోవటం కొంత కష్టంతో కూడిన పని. ఆ ప్రయత్నంలో మీకు కొంత సాయం చేద్దామనే నిన్నివాళ పిల్చాను భోజనానికి''.

తలవంచుకుని వింటూ వుండిపోయారు తాము. తన కోడలి భవిష్యత్తును గురించి చర్చించడానికి మనిషి ఎదగగలగడం చాలా గొప్ప విషయమే. ఆయన ఎంత మథనపడి తీసుకున్న నిర్ణయమో అది!

''మా సురేంద్రతో అమ్మాయి పెళ్ళి చాలా చిన్నవయసులో అయింది. అప్పటికింకా స్త్రీ పురుష సంబంధాల గురించి ఆమెకేం తెల్సో నాకు తెలియదు. ఏం తెలియకుండానే తల్లి అయింది. ఇప్పుడు చూసుకుంటే అంతా శూన్యమే. అది పూరించాలనే తపన మనసుపడడం సహజం. నీ సందేహాలూ నాకు తెల్సు. పిల్ల తల్లిని వివాహమాడే స్థితికి సమాజం ఎదగలేదు. నువ్వు సిద్ధమైనా నీ తల్లిదండ్రుల కభ్యంతరముండవచ్చు. కనుక వీలైనంత త్వరలో మీరో నిర్ణయానికి రావడం మంచిది''.

''మీరే నా పరిస్థితిలో వుంటే ఏం చేస్తారు?''

''నా సుఖం, నా భవిష్యత్తు నాకు ముఖ్యం. నేను పెళ్ళి చేసుకోబోయే స్త్రీ నాకవి రెండూ ఇవ్వగలదని నేను నమ్మితే నేనా పెళ్ళి చేసుకుంటాను, ఎవరు అడ్డంకి

చెప్పినా విననుʼʼ.
ʻʻఅంత సీదాగా నిర్ణయాలు జరగవేమో ప్రపంచంలోʼʼ అన్నాడు సుధాకర్.
ʻʻనిజమే, అది మనిషిని బట్టి వుంటుందిʼʼ
తనను పట్టించుకోకుండా వాళ్ళిద్దరూ అలా మాట్లాడుకోవడంతో తనకు కోప మొచ్చింది.
ʻʻనేను బొమ్మను కాదు మావయ్యా, మీరలా నిర్ణయాలు తీసుకోడానికిʼʼ అంది తను.
ʻʻనిజమేనమ్మా! ఇందులో బలవంతమేముంది? ఆలోచించుకో. నీ కొడుకు గురించి ఆలోచిస్తున్నావు నువ్వు. పెరిగి పెద్దవాడైనప్పుడు తల్లిని అర్థం చేసుకోలేని వాడు మహేంద్రుడు కాదనిపిస్తుంది నాకుʼʼ.
ఆ తర్వాత కూడా తామిద్దరినీ ప్రోత్సహించ ప్రయత్నించాడు ఆయన. సుధాకర్ తల్లిదండ్రులు ఈ వివాహానికి విముఖులన్న సంగతి తెలిపోయింది. అయినా, అతను వాళ్ళనెదిరించి తన్ను పెళ్ళి చేసుకోవడానికి సిద్ధపడ్డాడు. తనకే ఎటూ తేలని పరిస్థితి అయిపోయింది. మావయ్య నుంచి ఎలాంటి అభ్యంతరం లేదు. నిజానికి తన తండ్రే అందుకు అభ్యంతరం చెప్తాడేమో. ఏమైనా తనెలా ఆ పని చేయగలదు. రేపు పెరిగి పెద్దవాడైన మహేంద్రుడు తన తల్లిని గురించి ఏమని ఆలోచిస్తాడు. ఎవరేమనుకున్నా తను భరించగలదు కానీ, తన కొడుకు తనను గురించి తప్పుగా భావిస్తే తను భరించలేదు. మాండవ్యుడి భార్యకు ఎదురైన సమస్య అదేనేమో. ఏ బంధాన్నైనా తెంచుకోవచ్చునేమో గాని, సంతానం పట్ల వున్న ప్రేమ బంధనాన్ని తెంచుకోవడం కష్టం. భార్యాభర్తల సంబంధం అప్రాకృతమైంది. కానీ సంతానం తోడి బంధం అలాకాదే. ఎన్నో యుగాలనుంచి భారతనారికి ఈ సమస్య విషయంలో తృప్తితో కూడిన సమాధానం దొరకలేదు. ఆ రక్తం తనలోను ప్రవహిస్తున్నందువల్ల తనూ అలా ఆలోచిస్తున్నదేమో. ఓసారి ʻʻనువ్వు ఊహల్ని ప్రేమిస్తున్నావు. వాటిల్లో జీవిస్తున్నావు. కానీ, కావల్సింది వాస్తవంలో బతకడం అమ్మాయి!ʼʼ అని మావయ్య అన్నాడు. కాని... తను వాస్తవంతో సమాధానపడలేకపోతోంది. ఊహలే వాస్తవమనిపిస్తున్నాయి.

***

ఆలోచనల్లో మునిగిపోయిన సునందకు టెలిగ్రాం మెసెంజర్ బెల్ నొక్కి పిలవడం వినపడలేదు. రాజశేఖరం వచ్చి, సంతకం చేసి, టెలిగ్రాం అందు కున్నాడు. చించి చదివి నిర్ఘాంత పోయాడాయన. తేరుకుంటూ.
ʻʻనిన్న పొద్దున ఫ్లయిట్‌లో బొంబాయి వచ్చాడట సురేంద్ర. రేపు పొద్దున బొంబాయి ఎక్స్‌ప్రెస్‌లో ఇక్కడికి వస్తున్నాడుʼʼ అన్నాడు.
ఓ క్షణమాగి, ʻʻఫోనుచేసే ధైర్యం లేదు వెధవకు. టెలిగ్రాం ఇచ్చాడుʼʼ అన్నాడాయన. ఆ గొంతులో కొడుకుపట్ల ఆర్ద్రత వుందో, కోపం వుందో నిర్ణయించుకోలేకపోయింది సునంద.
ఆమెకూ అది అనుకోని సంఘటనే. మళ్ళీ ఈ జీవితంలో తను సురేంద్రను చూడగలదని ఆమె అనుకోలేదు. ఆరోజు మామాకోడళ్ళలో ఎవరికీ నిద్ర పట్టలేదు. ఇప్పుడతన్ని ఎలా రిసీవ్ చేసుకోవాలో ఇద్దరికీ తట్టలేదు. అతనికోసం స్టేషన్‌కెవరూ వెళ్ళలేదు,
ట్రైన్ సమయానికే వచ్చినట్టుంది. పొద్దున ఏడుగంటలకల్లా ఆటోలో ఇంటి కొచ్చాడు సురేంద్ర. ఆటో ఆగడం చూసి రాజశేఖరం గుమ్మం దాకా వచ్చాడు. సునంద డైనింగ్ టేబుల్ దగ్గర నిలబడిపోయింది. ఆతృతగా, ఉత్కంఠగా, అతను లోపలకు వచ్చాడు. మనిషి మరింత పచ్చబడ్డాడు. చిక్కిపోయి వున్నాడు. ఆ కళ్ళలో మునుపటి ఉత్సాహం, కాంతీలేవు. ఏదో తెలియని నిర్వేదం, నిస్పృహ గోచరిస్తున్నాయి. సర్వం కోల్పోయిన వ్యక్తిలా ఉన్నాడు. మనిషిని చూసి సునంద హృదయం తరుక్కుపోయింది.
ʻʻరా, నాన్నా, రా. మళ్ళీ ఈ జీవితంలో నిన్ను చూస్తాననుకోలేదు. సమయానికే వచ్చావు. అమ్మాయి పెళ్ళి చేద్దామనుకుంటున్నాను. ఓ నెల రోజులయినా సెలవు పెట్టివచ్చావా? నువ్విక్కడ వున్నప్పుడే ఆ శుభకార్యం జరిపించేస్తే నాకు మనశ్శాంతిగా వుంటుందిʼʼ అన్నాడు రాజశేఖరం.
సునంద గమనించింది. ఆయన గొంతులో కొడుకు పట్ల ప్రేమ వుంది. నిష్ఠూరం వుంది. ఎద్దేవా వుంది. తప్పుడు పనికి శిక్షించాలనే అభిజాత్యం వుంది, దెబ్బ తీయాలనే కసి వుంది. కొడుకుని చూసి 'ఇప్పుడేం చేద్దామని వచ్చావురా, కొంపకూలి పోయిం తర్వాత' అని రోదనతో కూడిన ఆవేదన వుంది.
అలాంటిదేదో జరుగుతుందనే ముందుగా ఊహించి వచ్చినట్టున్నాడు


ఈడు... జోడు ... అందం... ఐశ్వర్యం
కళ్యాణం ... కాకతీయ!

కాకతీయ మ్యారేజస్ ప్రై. లిమిటెడ్.
103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్మాస్ వెనుక,
అమీర్‌పేట్, హైదరాబాద్. 500 073.
ఫోన్స్: 040-23747777 , 9391999999



FREE online Registration &
Free search
www.kaakateeya.com
www.telugumarriages.com
www.kannadamarriages.com
www.tamilmarriages.com

| | |
|---|---|
| అమీర్‌పేట్ | నెల్లూరు |
| కూకట్‌పల్లి | తిరుపతి |
| దిల్‌షుఖ్‌నగర్ | కర్నూలు |
| విజయవాడ | (చెన్నయ్) టి.నగర్ |
| గుంటూరు | బెంగుళూర్ |
| తెనాలి | సేలం |
| విశాఖపట్నం | మధురై |
| రాజమండ్రి | వెల్లూరు |
| కాకినాడ | తిరుచి |
| ఖమ్మం | పాండిచ్చేరి |
| ఒంగోలు | ఈరోడ్ |
| | ఏలూరు |

చెన్నయ్ (అన్నానగర్), చెన్నయ్ (పోరూర్), (చెన్నయ్) తాంబరం, జయానగర్, కోయంబత్తూరు.


సురేంద్ర. ఓ సన్నని బాధారేఖ అతని ముఖంలో లేశమాత్రంగా తొంగిచూసి తొలగిపోయింది. అలసటగా సోఫాలో చేరగిలబడి ʻʻఇంక నేను స్టేట్స్‌కు వెళ్ళడం లేదు. ఇక్కడే సెటిలయిపోవాలని వచ్చానుʼʼ అన్నాడతను ఎవరివంకా చూడకుండా
ʻʻముందాయన్ని కాఫీ అయినా తీసుకోనివ్వండి మామయ్యా!ʼʼ అంది సునంద. రాగానే అలాంటి ఆహ్వానం పలకటం ఆమెకు బాధనిపించింది. తనలోని అపరాధ భావనకు సమాధానం చెప్పలేక పోయింది ఆమె.
సురేంద్ర ఓ క్షణం తలయెత్తి ఆమె వంక చూసి తలదించుకున్నాడు.
ʻʻఇవ్వమ్మా ఇవ్వు, వద్దన్నానా! అయినా బయటి కాఫీలు మరిగినవాడికి ఇంటి కాఫీ ఏం రుచిస్తుందిలేʼʼ అన్నాడు రాజశేఖరం.
ఆ ఎద్దేవా సురేంద్ర గమనించకపోలేదు. అన్ని అవహేళనలకు అతీతమైన నిర్వికారదశలో ఉన్నాడతను.
సునంద కాఫీ కప్పు తీసుకువచ్చింది. అతను కప్పు తీసుకుంటుంటే ఆమె చేయి తగిలి తప్పయిపోయింది క్షమించమన్నట్టు ఆమె వంక చూశాడు.
అతను కాఫీతాగి స్నానం చేయడానికి బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు. ఈ లోపల రాజశేఖరం కొడుకు సామానుల్ని గెస్ట్‌రూంలో పెట్టించాడు.
బ్రేక్‌ఫాస్ట్ చేసేటప్పుడు మహేంద్రుడు తండ్రి వంక చూసి ʻʻఎవరు తాతా! ఈ అంకుల్ʼʼ అనడిగాడు.
ʻʻఅమెరికానుంచి వచ్చాడు..ʼʼ అన్నాడు తడబడుతూ రాజశేఖరం
మామగారు తొట్రుపాటు పడడం, సరైన సమాధానం చెప్పలేక పోవడం చూసి అంది సునంద కొడుకుతో ʻʻఅంకుల్ కాదు మహీ, మీ నాన్న... డాడీʼʼ అని.
ʻʻహాయ్... డాడీʼʼ అని పలుకరించాడు మహేంద్రుడు తండ్రిని.
చిరునవ్వు నవ్వుతూ కొడుకువంక చూశాడు సురేంద్ర. ʻʻనీ కోసం ఎన్నో ఆట వస్తువులు తెచ్చాను అమెరికానుంచి. సాయంత్రం స్కూలు నుంచి వచ్చాక ఇస్తానుʼʼ అన్నాడు.
ʻʻథ్యాంక్యూ పాపా!ʼʼ

కవిత

# మరపు

నేనెవర్ని?
ఇది వేదాంతి అంటున్న మాట కాదు.
తనని గుర్తు చేసుకోటానికి
అల్లల్లాడే పండుటాకుది
చిగురుగా పుట్టినప్పుడు
ఆ లేత మెదడు
వట్టి తెల్లకాయితమే!
ఉంగా పాటలనించి
పడి లేచిన పాదాల ప్రయాణంలో
బాల్యం పలక మీద రాసినవన్నీ
వంకర టింకర అక్షరాలే!
గురువు చిటికెన వేలందుకున్న
వేల గ్రంథాల భాండాగారానికి
తాళం చెవి పోయిందా..?
న్యాయ సలహాలు గణాంక దస్త్రాలు
ఏ చీకటి లోయలోకి జారిపోయినై?
ఆ మనసు పుటల్లో
ఎన్నెన్నో ఫోన్ నెంబర్లు.. ఫైళ్ళ వివరాలుండేవి
ఆ పెదవుల మమకారం
కమ్మని తెలుగు పద్యాలు విన్పించేది
ఎక్కడో.. ఈ కుండకి చిల్లు పడింది
నిన్న వచ్చిన కరెంటు బిల్లు
మొన్న దాచిన పాస్‌బుక్
కన్న కూతుర్ని కూడా
అపరిచితంగా చూసే
విధ్వంసక విషాదం!
బతుకు పుస్తకంపై
కాలం ధూళిమేఘం
గోరుముద్దలు పెట్టిన అమ్మలాలన
అందీ అందని ఛాయాచిత్రం..
చెరువులో మునకేసిన చిన్నారి స్నేహితుడు
కన్నీటి చుక్కంత జ్ఞాపకం
ఏవేవో గుర్తొస్తున్నాయి
కానీ.. జీవన సూత్రమే
ఎక్కడో తెగినట్టుంది
చెరిగిపోతున్న చైతన్యలిపిని
భద్రపరిచే పెన్‌డ్రైవ్ లేనప్పుడు
చివరికి మిగిలేది
ఒక అస్పష్ట అయోమయం!
ఇంతదూరం నడిచిన కాలిగుర్తులన్నీ
మరపు మడతల్లోకి ఇంకిపోతే
ఆనవాలు పట్టలేని వృద్ధ శిశువు
మళ్ళీ అదే తెల్ల కాయితం!
కానీ.. మనకు మాత్రం
దానిపై కన్పించే రాతలెన్నో!



–డా. సి.భవానీదేవి
**9866847000**

బ్రేక్‌ఫాస్టయి, మహేంద్రుడు స్కూలు కెళ్ళింతర్వాత చెప్పాడు సురేంద్ర. ఎలా లిజాకు, తనకు పడకపోయింది. ఆమెకు విడాకులివ్వడం, ఆత్మ శాంతి కరువ వడం, స్వదేశం చూడాలన్న తపన అన్నీ... తను చెప్పిన మాటలు కొద్దే కాని, ఎంతో ఊహించుకుని పూరించుకుంది సునంద.

సునంద హౌస్‌సర్జెన్సీ చేస్తోంది. అతనొచ్చిన సందర్భంలో ఆసుపత్రికి వెళ్ళడం మానేద్దామనుకుంది. కానీ ''నువ్వింకా బయలుదేరవేవమ్మా!'' అని అడిగాడు రాజశేఖరం.

''ఇవాళ వెళ్ళనులే మావయ్యా'' అంది సునంద.

''ఎవరో బంధువులు ఇంటికొస్తుంటారు. అలా ఎవరో వచ్చినప్పుడల్లా మనం డ్యూటీ కెళ్ళకుండా ఎగ్గొట్టడం సరైన పనికాదు'' అన్నాడాయన.

అతన్ని ఎవరో బంధువుగా పేర్కోవడం సునందకూ, సురేంద్రకూ కూడా అఘాతమ్మైంది. ఆమె మాట్లాడకుండా అలాగే మౌనంగా నిలబడిపోయింది.

రాజశేఖరం చెప్పాడు, ఎలా సురేంద్ర హృదయం లేకుండా ప్రవర్తించిందీ, తాము ఎంత బాధ పడిందీ, తాను సునందను ఎలా ప్రోత్సహించి డాక్టరు కోర్సు చేయించిందీ.

''ఇప్పుడు అమ్మాయి, ఆమె క్లాసుమేట్ సుధాకరం పెళ్ళి చేసుకోవాలను కుంటున్నారు. అప్పుడలా హఠాత్తుగా మమ్మల్ని వదిలివెళ్ళిన వాడిని మళ్ళీ ఇప్పుడు హఠాత్తుగా ప్రవేశించావు. మేం ఈ ఎదురుదెబ్బలకు తట్టుకోలేం. నువ్వు ఈ ఇంట్లో పుట్టావు. పెరిగావు. నిన్ను ఇక్కడకు రావద్దనే హక్కు నాకు లేదు. ఇంటి యజమాని వచ్చాడు కనుక, మేం అద్దెకున్న వాళ్ళం రెండు మూడు రోజుల్లో వెళ్ళిపోతాం. నువ్వు నీ జీవితాన్ని ఏం చేసుకోదలచుకున్నావో నాకు తెలీదు. నీ ఇష్టం. మేమిక్కడున్న నాలుగురోజులు నీకు ఇబ్బందిగానే వుంటుంది. సర్దుకో మరి'' అన్నాడు రాజశేఖరం.

ఆయనలా మాట్లాడుతుంటే భూమి పగిలి తన్నెందుకు దాచుకోలేదా అన్నంత మధనపడింది సునంద.

''ఇది నా ఇల్లు కాదు నాన్నా, మీదే. నేను గెస్టనని మీరే చెప్పారు. మీరెళ్ళాల్సిన పని లేదు, నేను వెళ్తాను. ఇందులో తప్పంతా నాదే. సునంద పెళ్ళి చేసుకోవడం సరైన పనే. ఆమె నిజానికి ఇంత కాలం దాకా ఆగాల్సిన పనిలేదు. వయసుడిగిన మీ భుజాల మీద ఇంతభారం వేసి వెళ్ళిపోయాను. అందుకు మీరు నన్ను క్షమించాలి. సునందను మన్నించమని అడిగి ఆమెని నేను అవమానించలేను. ఐ విష్ హర్ ఆల్ ది బెస్ట్ ఇన్ లైఫ్'' అన్నాడు సురేంద్ర దీర్ఘంగా నిట్టూరుస్తూ.

ఇంతలో ఫోన్ మోగింది. రాజశేఖరం ఫోనెత్తాడు ''హలో, ఎవరూ?''

''..........''

''సుధాకరమా! ఆఁ మా అబ్బాయి వచ్చాడు అమెరికా నుంచి. అందుకే ఇవాళ సునంద ఆసుపత్రికి రాలేదు. అన్నట్టు అక్కడ ఆస్పత్రిలో నీ డ్యూటీ అయిన తర్వాత ఇటుకేసి రారాదూ. అమ్మాయి విషయంలో నిర్ణయం తీసుకోవలసిన ఘడియ వచ్చింది. ముఖాముఖీ అన్నీ తేల్చేద్దాం''.

''...............''

''నిన్ను ఫోనులో పిలుస్తున్నాడమ్మా''

సునంద అతనితో ఫోనులో మాట్లాడి ఫోన్‌క్రెడిల్ చేసింది. ఫోనులో అతను చెప్పిన మాటలు ఆమెను తన నిర్ణయం తాను తీసుకునేటట్టు చేశాయి. ''నేను ఇవాళ మీ ఇంటికి రావడం లేదు. వచ్చి. 'మీ భార్యను నేను పెళ్ళి చేసుకుంటున్నానండీ' అని మీ భర్తకు చెప్పగలిగే ఎంబ్రాసింగ్ సిట్యుయేషన్‌ను నేను ఎదుర్కోలేను. మీరెప్పుడు నా జీవితంలోకి రాదలచుకున్నా మీకాహ్వానమే. నేనుగా వచ్చి మీ భర్తతో ఆ మాట చెప్పలేను'' అన్నాడతను.

''థాంక్స్, మామయ్యా, మీరు నాకోసం చేసిందానికి. నేను పెళ్ళయిన ఆడదాన్ని, మళ్ళీ పెళ్ళి చేసుకోలేను. ఈ విషయంలో మీరు నాకింకేం చెప్పొద్దు'' అంది సునంద.

''మరోసారి ఆలోచించుకో, అమ్మాయి. నువ్వు పొరపాటు చేస్తున్నావేమో, నీది తిరోగమనమేమో. వచ్చిన బంగారు అవకాశాన్ని చేజార్చుకోకు. జీవితంలో మళ్ళీమళ్ళీ అవకాశాలు రావు'' అన్నాడాయన. ఆయన ముఖంలో ఆవేదన మాత్రం లేదు. ప్రశాంతంగా వుంది. అంతఃమనఃపటలంలో ఆనందముందేమో తెలియడం లేదు. ఆవేశానికీ, బుద్ధికీ జరిగే సంఘర్షణ ప్రదర్శితమ్మైంది ఆయన మాటల్లో.

''అవునేమే. నిజంగానే పొరపాటుచేస్తున్నానేమో. అనాదిగా ఆడది చేస్తున్న పొరపాటే ఇది. నా మనస్సుకు స్వాంతన, భద్రత అవసరం మామయ్యా, భూతం గడిచిపోయింది. నడుస్తున్న వర్తమానంలో నుంచి భవిష్యత్తును సుఖ ప్రదం చేసుకునే ప్రయత్నమిది. నా కొడుకు నా భవిష్యత్తు'' అంది.

ఆయన స్వచ్ఛంగా, తెల్లగా, మహదానందంగా నవ్వాడు. అందులో స్వార్థం ప్రస్ఫుటితమవుతూనే ఉంది. తన కొడుకు కుటుంబం చల్లగా ఉండడం ఏ తండ్రయినా కోరుకునేదే!

ఆపైన ''లేవండి మీరు.. మీకు రాత్రి ట్రైనులో నిద్రపట్టిందో లేదో, రెస్టు తీసుకుందురుగాని'' అంది సునంద, సురేంద్రతో.

సురేంద్ర లేచి సునంద వెనుక మెట్లెక్కి మేడ పైకి వెళ్ళసాగాడు. వెళ్తున్న కొడుకు, కోడలు వంక తృప్తిగా చూశాడు రాజశేఖరం.

పడకగది గుమ్మం పట్టుకు నిలబడిపోయాడు సురేంద్ర ''ఆగు, సునందా. నేనేమాశించీ ఇంటికి తిరిగిరాలేదు. నే పోగొట్టుకుంది తిరిగి లభిస్తుందని రాలేదు. ఐ పిటీ యు ఫర్ వాట్ హేజ్ బీన్ ఫోర్స్‌డ్ ఆన్ యు. అంతా మరచి పోయి మనం మళ్ళీ భార్యాభర్తలుగా వుండగలమా అనిపిస్తోంది నాకు. అంతా కృతకంగా వుంది. నీ మీద ఇప్పటికీ నాకిష్టం పోలేదని చెప్పడం అర్థం లేని విషయం.

నేనీ పరిస్థితితో రాజీపడలేక పోతున్నాను'' అన్నాడు.

''కనీసం ఈ మాత్రపు మానసికస్థితిలో మీరున్నారని తెలిసి నాకానందంగా వుంది. కాని, నేను పెళ్ళిచేసుకోవడం లేదంటే అర్థం నేను మీతో కాపురం చేస్తానని కాదు. మామయ్యన్నట్టు మీ ఇంటికి తిరిగొచ్చిన మిమ్మల్ని వెళ్ళ గొట్టగలిగే అధికారం నాకు లేదు. ఆయన్ని కష్టపెట్టడం నా కిష్టం లేదు. మీరిక్కడి నుంచి వెళ్ళిపోతే మావయ్య మనసు బాధ పడిపోతుంది. అందుకే మనం ప్రపంచానికి భార్యాభర్తలంగా వుంటాం కానీ మనమధ్య ఆ సంబంధ ముండదు. మీకు కోరికలుంటాయి. కాదనను. మళ్ళీ పెళ్ళిచేసుకోదలిస్తే చేసుకోండి. నా కభ్యంతరం లేదు. మీకు మరో స్త్రీ సాంగత్యం ఉందని నాకేం కోపం లేదు. శారీరక సంబంధానికి నేనంత ప్రాధాన్యం ఇవ్వను. అంత తేలిగ్గా మన మధ్య వున్న మానసిక బంధాన్ని ఎలా తెంచుకోగలిగారో నాకు తెలీని విషయం. నేనూ మనిషినే, నా మనసూ తనువూ ఊగిసలాడుతుంది వాంఛా పరితృప్తికోసం. కానీ, ఓ స్త్రీకో పురుషుడన్న దౌర్భాగ్యపు ఆదర్శం నా మనసులో ఎందుకులోతుగా పాతుకుపోయిందో! యుగాల తరబడి భారతనారి రక్తంలో జీర్ణించుకుపోయి నాకు వారసత్వంగా వచ్చినట్టుంది ఇది. ఆ ఆలోచనల ఫలితంగా ఏర్పడిన సమాజం ఇచ్చే భద్రత, శాంతులను ఆశించే నేను ఈ దౌర్భాగ్యపు ఆదర్శానికి నన్ను నేను త్యజించుకోక తప్పదు. చదువుకున్న చదువూ, ప్రగతికి ఉన్ముఖంగా ఆలోచించేబుద్ధీ మనసుకు నచ్చచెప్పలేక పోతున్నాయి. ఇదో సంఘర్షణ. నేను మా మానసాన్ని నిద్రపుచ్చలేక పోయాను. ఓడిపోయాను'' అంది సునంద పక్క సరిచేస్తూ.

ఆమె ఉద్వేగంతో అలా చెప్పుకు పోతుండడం సురేంద్రకు కొత్త అనుభవం. ఆమె అప్పటి సునంద కాదు, అప్పుడు ఏడేళ్ళ క్రితం ఏమీ తెలియనితనంలో కలలుకంటూ ఈ ఇంటికొచ్చిందామె. తాను తప్ప వేరే దృష్టిలేదు ఆమెకు. తన తోడిదే లోకం. ప్రపంచంలో ఆమె చాలా అనుభవాల్ని పొందేట్టు చేశాడు తను. చాలా ఎత్తుకుఎదిగిపోయింది ఆమె. తనంత ఎత్తుకు చేరుకోగలడా అనిపించింద తనికి. అక్కడ తన జీవితం సుందర రమ్యహర్మ్యంలా కనిపించింది. అది ప్లాస్టిక్‌తో కట్టిన ఇల్లని తనకప్పుడు అవగతం కాలేదు. దారినపోయే నిప్పు ఆ ఇంటిని దగ్ధం చేసి బూడిద చేసినప్పుడు కాని తనలో ఆలోచన మొదలవలేదు.

''నా కలలన్నీ బూడిద చేశారు మీరు. ఆకాశంలో ఆనందంగా విహరిస్తున్న విహంగాన్ని నేనప్పుడు. ఒక్క బాణంతో కూల్చేశారు. గాయపడి కిందపడ్డ నాకు వాస్తవాలు ఎదురయ్యాయి. భయంగొల్పే వాస్తవాలు. నేనూ నేర్చుకోవడం మొదలెట్టాను. మావయ్యలాంటి మహావృక్షపు నీడలో రవంత ఆత్మశాంతి లభించింది. నా కొడుకు నా బతుక్కు ఆలంబనమయ్యాడు. వాడే లేకపోతే ఇవాళ బయటి ప్రపంచానికి కూడా మనం భార్యాభర్తలుగా నటించాల్సిన అవసరం లేదు. ఇక్కడా రాజీపడాల్సి వచ్చింది. ప్రకృతి స్త్రీకి విధించిన శిక్షేమో ఇది. పెరిగి పెద్దవాడైన కొడుకు తండ్రిని వదిలేసిన తల్లిని గురించేమను కుంటాడు. వాడు నన్ను అసహ్యించుకోవడం నేను భరించలేను. అది మృత్యువు నాకు. చావలేను కనుక, బతకాలి కనుక, ఏ స్పందనా లేని కట్టెలాగా బతుకు తాను. మనం కలిసే వుంటాంగానీ చెరో ఖండంలో వుంటాం, ఇన్నేళ్ళూ వున్నట్టు. అయితే, ఓ రిక్వెస్టు. మామయ్యకు మన సంగతి ఏ మాత్రం తెలియ కూడదు. ఏ కొంచెం సూచన లభించినా ఆయన పసిగట్టగలడు. అప్పుడాయన గురయ్యే వ్యధను నేను అంచనా వేయలేను. మీరు ఇక్కడికి తిరిగి రారని రాసిన రోజున అత్తయ్య చనిపోయిందన్న స్పృహ ఆయనకు కలిగింది. మళ్ళీ ఆమెను చంపకండి. ఆమె చనిపోయిందన్న వ్యథకు ఆయన్ని మళ్ళీ గురిచేయకండి'' అంది సునంద, బయటికి వెళ్ళిపోతూ.

తను అడక్కుండానే లభించిన వరాన్ని తానెలా తృణీకరించాడో అప్పుడు అవగతమైంది సురేంద్రకు. మళ్ళీ ఆమెను జయించాలి, ఆమె మనసును గెలవాలి. తనకు తెలీకుండానే ఆమె తనకు మరో అవకాశమిచ్చింది. ఈసారి వచ్చిన అవకాశాన్ని తను పోగొట్టుకోకూడదు అనుకుంటూ పక్కమీద నడుం వాల్చాడు సురేంద్ర

కింద హాల్లో సోఫాలో కూర్చుని పేపరు చదవ ప్రయత్నించాడు కానీ ఒక్క పంక్తికూడా రాజశేఖరం బుర్రలోకి దూరలేదు. అన్యమనస్కంగా మెట్లుదిగి వస్తోన్న కోడలి వంక తృప్తిగా ఆనందంగా చూశాడాయన, 'మాన్, లాంగ్ లివ్ దై సెల్ఫ్' అనుకుంటూ.

✻

–'ఆంధ్రజ్యోతి' సచిత్ర వారపత్రిక –1997

నవ్య పజిల్

## పదగారడి-316

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | ✱ | 2 | | 3 | | 4 | | ✱ |
| | ✱ | | ✱ | | ✱ | | ✱ | 5 |
| 6 | | ✱ | 7 | | | ✱ | 8 | |
| | ✱ | 9 | ✱ | | ✱ | 10 | | ✱ |
| ✱ | 11 | | ✱ | ✱ | ✱ | 12 | | ✱ |
| 13 | ✱ | | ✱ | 14 | ✱ | | ✱ | 15 |
| 16 | | ✱ | 17 | | | ✱ | 18 | |
| | ✱ | 19 | ✱ | | ✱ | 20 | ✱ | |
| ✱ | 21 | | | | | | ✱ | |

### ఆధారాలు

**అడ్డం**

2. రాముడు చేసిన యాగం.
6. జలుబుతోనే ఇదీనూ..
7. ఎక్కువా కాదు. తక్కువా కాదు.
8. ఆవు... మరో విధంగా.
11. ఇది నేర్చినమ్మ బొంకునేర్వదా?
12. కే..కే..కే.. చేయి.
16. రష్యన్ చక్రవర్తి.
17. మంచివయసు.. వనంతో అంతం.
18. ఇది విడిచి సాము చేయరాదు.
21. ధర్మరాజు చేసిన యాగం.

**నిలువు**

1. రావణపత్ని.
2. ఇదీ ఉంది ముఖం ఉంది అంటారు.
3. ఒక రకం మామ.
4. నీ చేతిమాత్ర వైకుంఠ...?
5. కైలాసపతి.
9. గాంధారీ సోదరుడు.
10. దశరథ పత్ని.. భరత మాతా.
13. దేవుడు వరమిచ్చిన ఇతడు ఇవ్వనీయడా?
14. మామిడికాయతో పచ్చడి.
15. విరాట పర్వంలో భీముడు.
19. జబ్బు..?
20. పందొమ్మిది నిలువులోనిదే.

### పదగారడి - 315 సమాధానాలు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 చి | ✱ | 2 ప్ర | శ్నా | 3 ప | రు | 4 ద్రు | డు | ✱ |
| రు | ✱ | శ్న | ✱ | స్నీ | ✱ | మం | ✱ | 5 వి |
| 6 నా | ర | ✱ | 7 త | రు | వు | ✱ | 8 రు | జ |
| మా | ✱ | 9 పై | ✱ | ✱ | ✱ | 10 చై | ✱ | యం |
| ✱ | ✱ | 11 ద్యు | తి | ✱ | 12 మా | త్ర | ✱ | ✱ |
| 13 వి | ✱ | డు | ✱ | ✱ | ✱ | ము | ✱ | 14 ప్ర |
| 15 లా | స్యం | ✱ | 16 ఘో | 17 ట | కం | ✱ | 18 త్రో | వ |
| పం | ✱ | 19 ము | ✱ | క్క | ✱ | 20 చ | ✱ | రు |
| ✱ | 21 ప | ల్లె | టూ | రి | పి | ల్ల | ✱ | డు |

నిర్వహణ: పెద్దిభొట్ల సుబ్బరామయ్య